www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 16 జులై 2025 5 ఏలూరు



గోదావరి తగ్గుముఖం..



తగ్గుతున్న గోదావరి జలాలు

ప్రజాశక్తి - పోలవరం
పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టులోకి చేరుకున్న 2,27,066 క్యూసెక్కుల అదనపు వరద జలాలను జలవనరులశాఖ అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 28.250 మీటర్లు, దిగువన 18.400 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాం ఎగువన 28.400 మీటర్లు, దిగువ కాపర్ డ్యాం దిగువన 17.900 మీటర్లు, ఎగువ దిగువ కాపర్ డ్యాంల మధ్య 15.780 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

విజన్ ఓకే.. వసతుల్లేవ్..!

జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్‌పై ఇన్‌ఛార్జి మంత్రి సమావేశం

గ్రామీణ ప్రాంతాల్లో కనీస సదుపాయాలు లేవన్న ప్రజాప్రతినిధులు

రోడ్లు, విద్యుత్, వైద్యం,తాగునీరు వంటి సమస్యలు పరిష్కరిస్తేనే అభివృద్ధి అన్న నేతలు

ప్రతి నియోజకవర్గంలో 50 నుండి వందెకరాల భూములు గుర్తించాలని ఇన్‌ఛార్జి మంత్రి ఆదేశం

జిల్లా స్థూల ఉత్పత్తి రెట్టింపు చేసేలా ప్రణాళిక ఉండాలి

పెదవేగి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రయివేటుకు అప్పగించే ఆలోచన లేదు

మంత్రి నాదెండ్ల మనోహర్



మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ బాగున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, వైద్యం, విద్యుత్ వంటి సదుపాయాలు సరిగా లేకపోవడంతో ఆచరణలో ఇబ్బందిగా ఉందంటూ జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఏకరువు పెట్టారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో మంగళవారం జిల్లా, నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్‌లపై అధికారులు, ప్రజాప్రతినిధులతో ఇన్‌ఛార్జి మంత్రి సమీక్షించారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎంపి పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, బడేటి రాధాకృష్ణయ్య (చంటి), సొంగా రోషన్‌కుమార్, మద్దిపాటి వెంకట్రాజు, ఎస్‌పి కెపిఎస్.కిషోర్, జెసి పి.ధాత్రిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ జిల్లా, నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్‌లను ఏటా 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంతో జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. వచ్చే సమావేశం నాటికి విజన్ యాక్షన్ ప్లాన్ వద్ద ప్రణాళికను సుస్పష్టంగా, దీర్ఘకాలిక లక్ష్యంతో సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేసేందుకు 50 నుండి వందెకరాల భూమిని వెంటనే గుర్తించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన మంచి వాతావరణాన్ని కల్పించి, పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములను గుర్తించడంతోపాటు ప్రాథమిక, మౌలిక సదుపాయాలు కల్పిస్తే పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకొస్తారన్నారు. జిల్లాలో వ్యవసాయంతోపాటు ఆక్వా, ఉద్యాన రంగాల్లో వనరులను సద్వినియోగం చేసుకుని ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో స్థూల ఉత్పత్తి ఆదాయం రూ.72,314 కోట్లని, వచ్చే ఏడాదికి రెట్టింపు కావాలని అన్నారు. క్రాప్ డైవర్షన్ పథకం కింద మరింత విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా పెదవేగి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని ప్రయివేటుకు అప్పగించే ఆలోచన ఏదీ లేదని ఇన్‌ఛార్జి మంత్రి సమాధానమిచ్చారు.

మౌలిక సదుపాయాలపై చర్చలు

జిల్లాలో రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, పంచాయతీరాజ్, రహదారులు, భవనాల శాఖకు అదనంగా నిధులు వచ్చేలా కృషి చేస్తామని ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్ తెలిపారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పాలన సాగించాలన్నారు. జిల్లాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా, లోఓల్టేజీ సమస్యలు లేకుండా మండలస్థాయిలో సమీక్షించుకుని చర్యలు తీసుకోవాలన్నారు. పాడి పశువుల కొనుగోలుకు రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలపై అవగాహన కల్పించాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి ఆయా గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ వంటి ప్రాథమిక సదుపాయాల కల్పనపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

విజన్ యాక్షన్ ప్లాన్ అమలుకు పటిష్ట చర్యలు.. ★ ★ ★

కె.వెట్రిసెల్వి, జిల్లా కలెక్టర్

జిల్లా, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌లను పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో వంద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యానికిగాను ఇప్పటివరకు 27 యూనిట్లు ఏర్పాటు చేశాం. మిగిలినవి నిర్దేశించిన సమయంలోగా ఏర్పాటుకు చర్యలు. చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కు ఏర్పాటు చేశాం. మిగిలిన నియోజకవర్గాల్లోనూ త్వరలో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు చేస్తాం. ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు చర్యలు చేపట్టాం. పోలవరం, కొల్లేరు ప్రాంతాలతో పాటు టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు, మూడు ప్రాంతాల్లో ఫైవ్‌స్టార్ హోటళ్ల నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించాం. జిల్లాలో ప్రాథమిక సౌకర్యాలైన రోడ్లు, గృహనిర్మాణం, తాగునీరుకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి కల్పిస్తున్నాం.

పర్యాటక ప్రాంతంగా కొల్లేరు అభివృద్ధికి ప్రతిపాదన.. ★ ★ ★

పుట్టా మహేష్‌కుమార్, ఏలూరు ఎంపీ

కేంద్ర ప్రభుత్వం దేశంలో 50 ప్రాంతాల్లో పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. మన రాష్ట్రానికి మూడు ప్రాజెక్టులు మంజూరయ్యేలా ప్రయత్నిస్తున్నాం. అందులో కొల్లేరును పెద్ద పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలో ఉంది. జిల్లాలో పండిన పంటలకు అధిక లాభాలు వచ్చేలా ఇక్కడే ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే స్థానిక రైతాంగం లాభపడుతుంది. జిల్లాలోని కొన్ని గ్రామాల్లో ప్రజలకు ప్రాథమిక సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అంతరాయం, లోఓల్టేజీ లేని విద్యుత్, తాగునీరు ఆయా ప్రాంతాలకు అందించాలి. పోలవరం, కైకలూరు, చింతలపూడి ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

విద్యాభివృద్ధికి చర్యలు.. ★ ★ ★

ఘంటా పద్మశ్రీ, జెడ్‌పి ఛైర్‌పర్సన్

జిల్లాలో విద్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల స్థాయిని పెంచడంతోపాటు విద్యార్థుల స్థాయిని అనుసరించి అదనపు తరగతి గదుల నిర్మాణం, మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఏలూరులో ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటు చేయాలి

బడేటి చంటి, ఏలూరు ఎంఎల్ఎ

ఏలూరులో పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారు. పరిశ్రమల ఏర్పాటులో అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలి. ఏలూరు నియోజకవర్గంలో ఎన్నో ఇంజినీరింగ్, వైద్య కళాశాలలు ఉన్నాయి. కోర్సు పూర్తి చేసుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ఏలూరులో ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

కొల్లేరులో రోడ్లు వేయనీయడం లేదు ★ ★ ★

చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎంఎల్ఎ

కొల్లేరు ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరైనా అటవీ శాఖ అభ్యంతరాల కారణంగా పనులు చేపట్టలేకపోతున్నాం. దెందులూరు నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి. పాడిపశువుల కొనుగోలుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై రైతులకు మరింత అవగాహన కల్పించాల్సి ఉంది.

ప్రాథమిక అవసరాలైన రోడ్లు మంజూరు చేయండి..

సొంగా రోషన్‌కుమార్, చింతలపూడి ఎంఎల్ఎ

చింతలపూడి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్క్ ఏర్పాటు చేశారు. ప్రవాసాంధ్రులు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. నియోజకవర్గంలో ప్రాథమిక అవసరాలైన రోడ్లు మంజూరు చేయాలి. దీనిపై ఇన్‌ఛార్జి మంత్రి స్పందిస్తూ చింతలపూడి నియోజకవర్గంలో పంచాయ తీరాజ్, ఆర్అండ్‌బి రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణాలపై బుధవారం సాయంత్రంలోగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

టెంపుల్ టూరిజం అభివృద్ధి చేయాలి

మద్దిపాటి వెంకటరాజు, గోపాలపురం ఎంఎల్ఎ

గోపాలపురం నియోజకవర్గంలో ఫుడ్‌పార్క్ ఏర్పాటు, టెంపుల్ టూరిజం అభివృద్ధి చేయాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధుల ద్వారా రోడ్ల నిర్మాణం, ఐఎస్.జగన్నాధపురంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి.

కొల్లేరులో ఉపాధి పనులు కల్పించండి ★ ★ ★

జయమంగళ వెంకటరమణ, ఎంఎల్‌సి

కొల్లేరు ప్రాంతాన్ని ముంపు బారినుండి రక్షించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా కిక్కిస, తూడు, గుర్రపు డెక్కను తొలగించాలి. కొల్లేరు ప్రాంతంలో ఆక్వా రంగం అభివృద్ధికి లోఓల్టేజీ, అంతరాయం లేని విద్యుత్‌ను సరఫరా చేయాలి.

శాంతిభద్రతల సమస్య లేదు ★ ★ ★

కెపిఎస్.కిషోర్, ఎస్‌పి

ఏలూరు ఎటువంటి శాంతిభద్రతల సమస్యలు లేని జిల్లా. పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తారు. అమరావతి, విజయవాడ మన జిల్లాకు దగ్గరగా ఉండడం, ఏలూరు పరిసరాల్లో ఎన్నో ఇంజినీరింగ్, వైద్య కళాశాలలు ఉండడంతో నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో ఉద్యోగావకాశాలు ఎక్కువగా కల్పించొచ్చు.



అభివాదం చేస్తున్న నేతలు

స్మార్ట్ మీటర్లను అంతా వ్యతిరేకించాలి

వామపక్ష ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
గృహ వినియోగదారులకు, రైతులకు, వర్తక, వాణిజ్యవేత్తలకు పెనుభారంగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును అంతా వ్యతిరేకించాలని వామపక్ష ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా ప్రజానీకానికి పిలుపునిచ్చింది. విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో వామపక్ష ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ నెల 13న విజయవాడలో జరిగిన ప్రజాసంఘాల రాష్ట్ర సదస్సు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమ కార్యాచరణను వివరించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రామకృష్ణ, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, ఎంసిపిఐ (యు) జిల్లా నాయకులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ 2024కు ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు టిడిపి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిందని, ఇప్పుడు అధికారంలో ఉండి స్మార్ట్ మీటర్ల బిగింపునకు సిద్ధపడటం ఘోరమైన చర్యని అన్నారు. కొంతకాలంగా విద్యుత్ వినియోగదారులపై ట్రూఅప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలు, ఇతర అదనపు ఛార్జీల పేరుతో అధిక భారాన్ని మోపుతూ వసూలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై మోపిన అధిక భారాలను రద్దు చేయాలని, ఇప్పటి వరకు ప్రజల నుండి విద్యుత్ శాఖ వసూలు చేసిన అదనపు బిల్లులను తిరిగి చెల్లించాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపును ప్రభుత్వం ఆపాలన్నారు. లేనిపక్షంలో మరో బషీర్‌బాగ్ వంటి విద్యుత్ ఉద్యమాన్ని ప్రజల నుండి ఎదుర్కోక తప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, సిపిఐ ఏలూరు ఏరియా కార్యదర్శి యు.హేమశంకర్, ఐఎఫ్‌టియు నగర కార్యదర్శి యర్రా శ్రీను, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర కార్యదర్శి ఎ.లక్ష్మీ ఇందిర తదితరులు మాట్లాడారు.

నారుమళ్లు, నాట్లు ఎండిపోతున్నాయ్

కృష్ణాడెల్టా శివారు భూములకు నీళ్లివ్వాలని ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన ధర్నా



నినదిస్తున్న రైతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
సాగునీరు అందక వరి నారుమళ్లు ఎండిపోతున్నాయని, నాట్లు వేసిన చేలు బీటలు వారాయని, కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలు కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు, కౌలురైతులు మంగళవారం ధర్నా చేపట్టారు. జిల్లా కేంద్రం ఏలూరులోని వెంకటాపురం రైతుసేవా కేంద్రం వద్ద ఎండిపోతున్న వరి నారుమడిలో బీటలు వారిన వరి మట్టిగడ్డలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతులు జిల్లెల్లమూడి ప్రసాదరావు, చిన్ని పోతురాజు, అన్నంరెడ్డి రంగారావు, బైరెడ్డి లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రయివేటు అప్పులు తీసుకొచ్చి పెట్టుబడి పెట్టి నారుమళ్లు, నాట్లు వేసిన వరిచేలు ఎండిపోతున్నా జలవనరుల శాఖాధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణమని విమర్శించారు. ఏలూరు రూరల్ మండలం కృష్ణా డెల్టా పరిధిలోని వెంకటాపురం, మాదేపల్లి, జాలిపూడి, చాటపర్రు, పోణంగి, కొమడవోలు, కాట్లంపూడి తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల కృష్ణా డెల్టా భూములకు సాగునీరు అందడం లేదన్నారు. పంటలు ఎండిపోవడంతో అన్నదాతలు కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కృష్ణా మెయిన్ కెనాల్ నుండి జాలిపూడి, మాదేపల్లి వైపు వెళ్లే ప్రధాన పంట కాలువ గుర్రపుడెక్క, తూడు, తుక్కు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయి ఉందని, కనీసం పంట కాలువలు బాగు చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలను కాపాడాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అధికారుల నుండి స్పందన రాకపోతే ఈ నెల 16వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఏలూరు-కైకలూరు రోడ్డును సుంకరవారితోట వంతెన వద్ద దిగ్బంధనం చేయాలని రైతుల సమావేశంలో తీర్మానించారు. కార్యక్రమంలో రైతులు, కౌలురైతులు తలారి జయరాజు, మక్కా రమణ, సూరంగుల చక్రధరరావు, సుంకర నరసింహారావు, కస్తూరి నాగేశ్వరరావు, కస్తూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలి

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్
మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు గత ఏడు సంవత్సరాల నుంచి జీతాలు పెంచకపోవడం చాలా దారుణమని, పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో రెండవ రోజు నూజివీడు పురపాలక సంఘ కార్యాలయం వద్ద కార్మికుల సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 36 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని అన్నారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలనే నిబంధనలతో సంబంధం లేకుండా మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని, అలాగే రిటైర్మెంట్ బెనిఫిట్స్ కార్మికులకు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, పట్టణ అధ్యక్షులు ఎన్ఆర్.హనుమాన్లు, మున్సిపల్ యూనియన్ నాయకులు రంగారావు, అప్పారావు, రామారావు పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకు, తలసేమియా చికిత్స కేంద్రం సందర్శన

ఏలూరు అర్బన్ : ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ సొసైటీలో బ్లడ్ బ్యాంకు, తలసేమియా చికిత్స కేంద్రాన్ని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఏలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ బడేటి చంటి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాజకీయాలకు తావు లేకుండా డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్, సేవా భావం గల వ్యక్తులతో మంచి కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, కమిటీ వచ్చిన మూడు నెలల్లోనే బ్లడ్ బ్యాంకులో పాడైన మిషనరీని బాగు చేయించడం, ప్రజలకు అందుబాటులో ఉండేలా రక్త నిల్వలను పెంచడం, తలసేమియా చిన్నారులకు వారానికి రెండుసార్లు రక్తమార్పిడి చికిత్స నిర్వహించడం, ప్రస్తుతం ఉన్న రెండు డయాలసిస్ మిషన్లకు అదనంగా దాతల సహకారంతో మరో రెండు ఏర్పాటు చేసి త్వరలో డయాలసిస్ సేవలు అందించాలనుకోవడం అభినందనీయమని అన్నారు. జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ మరిన్ని మంచి సేవా కార్యక్రమాలను నిర్వహించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండేలా కమిటీ సభ్యులు పనిచేయాలని కోరారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ తలసేమియా కేంద్రంలోని సేవలు బాగున్నాయని, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేక తలసేమియా చికిత్స కేంద్రం ఏర్పాటు చేయడం, ముఖ్యంగా తల సేమియా, సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ప్రత్యేక ల్యాబ్ సౌకర్యం కల్పించడం అభినందనీయమని అన్నారు. సేవాభావం గల డాక్టర్లు రెడ్ క్రాస్ సొసైటీకి ఛైర్మన్లుగా వ్యవహరించడం ఎంత అవసరమో ఈరోజు రెడ్ క్రాస్ సొసైటీ సేవా కార్యక్రమాలను చూస్తే అర్థమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్‌వి.ప్రసాద్, వైస్ ఛైర్మన్ జె.సత్యనారాయణ రాజు, ఏలూరు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శశిధర్ బాబు, రెడ్‌క్రాస్ కార్యదర్శి బెన్నీ, కమిటీ సభ్యులు ఆలపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేషన్.. పరేషాన్..!

దూరాభారంతో పేదల అవస్థలు



ప్రజాశక్తి - ఉంగుటూరు
ఎండియు వాహనాల వ్యవస్థ రద్దుతో పేదలు రేషన్ సరుకులకు తీసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల గ్రామాల్లో ఈ పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కొన్ని గ్రామాల్లో మూడు నుంచి ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ తీసుకోవాల్సి ఉంటోంది. కనీసంగా రూ.50 వెచ్చించి ఆటోలపై వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది. ఆ సొమ్ము కూడా వెచ్చించలేని వారు కాలినడకన వెళ్లి రేషన్ తెచ్చుకుంటున్నారు. ఏడాది సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పర్యటిస్తున్న అధికార పార్టీ నాయకులను కార్డుదారులు దీనిపై ప్రశ్నిస్తున్నారు. పాత విధానంలోనే రేషన్ సరుకులు అందించాలని ఎక్కువ మంది మహిళలు కోరుతున్నారని ఆ పార్టీ నేతలే పరోక్షంగా చెబుతున్నారు.

మండలంలో కార్డుదారులు

ఉంగుటూరు మండలంలో 27 గ్రామ పంచాయతీల్లో 47 ఆవాస గ్రామాలుండగా 43 చౌక దుకాణాలు ఏర్పాటు చేశారు. 25,653 కార్డులున్నాయి. వీటిలో అత్యోందయ కార్డులు 1436 కార్డుల్లో 3038 (యూనిట్స్) మంది ఉన్నారు. తెల్ల రంగు కార్డులు 24,217 కార్డుల్లో 67,913 మంది (యూనిట్స్) ఉన్నారు. కొత్తగా రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు 202 వచ్చాయి. వీటిలో 35 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి.

ఈ గ్రామాల్లో రేషన్ కష్టాలు

కొత్త ఉంగుటూరులో దాదాపు 95 మంది కార్డుదారులున్నారు. వీరంతా సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉంగుటూరు దుకాణం నుంచి సరుకులు తీసుకెళ్లాల్సి వస్తోంది. కార్డు పోర్టబులిటి అవకాశంతో కొందరు నారాయణపురంలో రేషన్ తీసుకుంటున్నారు. మరి కొందరు ఉంగుటూరే వెళ్లాల్సి వస్తోంది. నాచుగుంట పరిధి కొత్తగూడెం కార్డుదారులు కిలోమీటర్నర దూరంలో ఉన్న నాచుగుంట వెళ్లాల్సి వస్తోంది. తిమ్మయ్యపాలెంలో దుకాణం నుండి కొత్తగూడెం రేషన్ కార్డుదారులు 365 మందికిపైగా సుమారు రెండు కిలోమీటర్లు వెళ్లి సురుకులు తీసుకోక తప్పడం లేదు. గొల్లగూడెంలోని రేషన్ దుకాణానికి సుమారు కిలోమీటరున్నరకుపైగా దూరంలో ఉన్న 120 మంది కొత్తగూడెం కార్డుదారులు రావాల్సి వస్తోంది. గోపీనాథపట్నం వెంకటేశ్వర కాలనీ ప్రజలు సుమారు 200 మంది రెండు కిలోమీటర్లు వచ్చి గోపీనాథపట్నం నుంచి సరుకులు తీసుకెళ్తున్నారు.

కొత్తగా రేషన్ పంపిణీ పాయింట్ తెరవాలి

రేషన్ సరుకుల పంపిణీలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా ఉండాలంటే కొత్తగా రేషన్ డీలర్లను నియమించాలి. లేదా ఈ ఐదు గ్రామాలకు అదనంగా రేషన్ పంపిణీ పాయింట్లు ఏర్పాటు చేయాలి. లేనిపక్షంలో ఆయా ప్రాంతాల్లో ప్రతినెలా రెండు రోజులపాటు డీలర్లతో సరుకులు ఇప్పిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే అలా ఇవ్వాలంటే డీలర్లకు అదనపు భారంతోపాటు సాంకేతిక సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు కన్పిస్తున్నాయి. వీటన్నింటినీ అధికారులు, ప్రజాప్రతినిధులు పరిశీలించి పేదలకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా రేషన్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో పరిష్కారం చూపుతాం

ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు

పలు గ్రామాల్లో పేదలు రేషన్ సరుకులు తీసుకోవడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సివిల్ సప్లయిస్ అధికారులతో మాట్లాడాం. దీనిపై పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ఆలోచన చేస్తున్నారు. సంబంధిత డీలర్లతో మాట్లాడి నెలలో రెండు రోజులపాటు ఆవాస గ్రామాల్లో సరుకులు ఇచ్చే విధానంపై త్వరలో నిర్ణయం తీసుకుంటాం. పేదలు ఆందోళన చెందొద్దు.

నెలలో కనీసం ఒక రోజైనా చాలు

సుధీర్, టిడిపి మండల అధ్యక్షుడు, ఉంగుటూరు

మండలంలో పలు గ్రామాల్లో రేషన్ ఇబ్బందులపై ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లాం. కనీసం నెలలో ఒక రోజైనా ఆ గ్రామాల్లో రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది. ఏడాది సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయి పర్యటనలో పలు గ్రామాల్లో పేదలు రేషన్ పంపిణీ సమస్యలనే ప్రస్తావిస్తున్నారు.

యువతకు విజ్ఞానం, ఉపాధి లక్ష్యంగా విజ్ఞాన కేంద్రం

గ్రంథాలయం ప్రారంభంలో వక్తలు

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంత యువతకు విజ్ఞానం, ఉపాధి లక్ష్యంగా ఆదివాసీ విజ్ఞాన కేంద్రంగా పనిచేస్తుందని పలువురు కొనియాడారు. సాంకేతిక రంగం అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత పరిస్థితిలో లుక్ కల్చర్ నుంచి బుక్ కల్చర్‌ను నిరంతరం ప్రతీ ఒక్కరూ అలవాటు చేసుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రం లోని ఆదివాసీ విజ్ఞాన కేంద్రం, కొవ్వాసు ముక్కయ్య(తండ్రి సూరయ్య) మెమోరియల్ ఆధ్వర్యంలో గ్రంథాలయం(నిరంతర అధ్యయనం)ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గ్రంథాలయం ప్రారంభ సూచికగా కొవ్వాసు ముక్కయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన ప్రారంభోత్సవ సభకు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కారం భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానుద్దేశించి ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం(ఏలూరు) నిర్వాహకులు జివిఎల్.నరసింహారావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పియువిఎన్.మునేంద్రరావు మాట్లాడారు. కొవ్వాసు సూర్యప్రకాష్ అమెరికా ఫార్మా రంగంలో ఉద్యోగం చేస్తూ విద్యా, ఆదివాసీ సంక్షేమం, అనేక నిరంతర సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఈ లైబ్రరీ కార్యక్రమంలో(పుస్తకముల కొరకు) తమ వంతు రూ.15 వేలు సహకారంగా అందించారు. మండల సర్పంచుల ఛాంబార్ మాజీ అధ్యక్షులు, అచ్చియ్యపాలెం సర్పంచి కుంజా వెంకటేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు ఎ.అశోక్, జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో కొవ్వాసు వెంకటలక్ష్మి, కొవ్వాసు చంద్రశేఖర్, కొవ్వాసు మేరీ కుమారి, ఆదివాసీ గిరిజన సంఘం సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరావు, సర్పంచులు తెల్లం వెంకాయమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి పాల్గొన్నారు.



గ్రంథాలయంలో పుస్తకాలు ఆవిష్కరిస్తున్న నేతలు

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

ఉంగుటూరు : ఉంగుటూరులోని అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ ఏలూరు జోన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.సుజాతారాణి తనిఖీ చేశారు. మంగళవారం ఆమె సెక్టార్ నెంబర్ 179, 183 కేంద్రాల్లో ఫేస్ ఆప్ ఆధారిత రేషన్ పంపిణీ, పూర్వ ప్రాథమిక విద్య, పిల్లల్లో బరువు, ఎత్తు తగ్గకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆమె వివరించారు. ఎక్కువ పిల్లల బరువులను చూసి రిజిస్టర్లో నమోదు చేశారు. ఆమె వెంట ఐసిడిఎస్ కార్యాలయ నోడల్ అధికారి సర్వారాజ్యలక్ష్మి, భీమడోలు సిడిపిఒ రాజకుమారి, సూపర్వైజర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జెడ్‌పి ఛైర్‌పర్సన్ హారికపై దాడి అమానుషం

దళిత సంఘాల నేతలు

ముదినేపల్లి : కృష్ణా జిల్లా జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టిడిపి శ్రేణులు దాడిచేయడం అమానుషమని దళిత నాయకులు అన్నారు. మంగళవారం ముదినేపల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ ఇటీవల గుడివాడలోని నాగవరప్పాడు దగ్గర హారికపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం దాడుల ప్రభుత్వమని, మహిళలు స్వేచ్ఛగా సంచరించే పరిస్థితి రాష్ట్రంలో లేదన్నారు. ప్రథమ పౌరురాలైన జెడ్‌పి ఛైర్‌పర్సన్‌కే రక్షణ లేకపోతే ఇక సామాన్య మహిళల పరిస్థితి ఏమిటన్నారు. హారికపై అకారణంగా దాడిచేసిన టిడిపి శ్రేణులను నేటికి అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. తక్షణమే దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత నాయకులు, వైసిపి గ్రామ కార్యదర్శి సభ్యులు నిమ్మగడ్డ బిక్షాలు, కారకొండ గ్రామ మాజీ సర్పంచ్ బేతపూడి వెంకటరమణ, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

పిఎసిఎస్‌ల త్రిసభ్య కమిటీల నియామకం

ముసునూరు : మండలంలోని మూడు గ్రామ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ అధ్యక్ష ఛైర్మన్ పదవుల నియామకంకు ఆర్డర్ వచ్చినట్లు కెడిసిసి బ్యాంక్ మేనేజర్ తలారి వెంకటరమణ ప్రసాద్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వలసపల్లి, కాట్రేనిపాడు, గోపవరం గ్రామ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఛైర్మన్, ఇద్దరు సభ్యులతో కూడిన త్రిసభ్య కమిటీ నియామకంకు సభ్యులు వలసపల్లి సొసైటీ ఛైర్మన్ కొల్లి కృష్ణయ్య, గోపవరం సొసైటీ ఛైర్మన్ ఉప్పలపాటి గణేష్, కాట్రేనిపాడు సొసైటీ ఛైర్మన్‌గా శ్యామలరావు పేర్లు పాలకవర్గ సభ్యులుగా ఆర్డర్ వచ్చినట్లు తెలియజేశారు. రాష్ట్ర గృహనిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదేశాల మేరకు ఛైర్మన్ పదవి పేర్లు మార్పులు, చేర్పులు ఉండవచ్చునని తెలిపారు.

150 హెచ్‌పి మోటార్ ప్రారంభం

ఏలూరు సిటీ : గోదావరి జలాలను పంపింగ్ చేసేందుకు నూతనంగా బిగించిన 150 హెచ్‌పి మోటార్ నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ దెందులూరు సమీపంలో ఉన్న గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సంబంధించిన 150 హెచ్‌పి మోటార్ గతంలో పాడైపోయిందన్నారు. ఈ సంవత్సరం వేసవికాలంలో మంచినీటి కోసం పడిన అవస్థలు రాబోయే రోజుల్లో పడకూడదనే ఉద్దేశంతో శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య, నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆదేశంతో నూతనంగా 150 హెచ్‌పి పంపింగ్ మోటార్‌ను కొనుగోలుచేసి బిగించి మంగళవారం ప్రారంభించారు. గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఇ సురేంద్రబాబు, ఎఇ(ఎల్‌ఎ) డిఇ నారాయణరావు, కార్పొరేటర్లు జిన్నూరు కనక నరసింహారావు, పాము శామ్యూల్ ఉన్నారు.

విద్యార్థులకు 'ఓరియంటేషన్ ప్రోగ్రామ్'

నూజివీడు టౌన్ : 2025 – 26 విద్యా సంవత్సరంలో ఆర్జియుకెటి పరిధిలోని నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో చేరిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఎస్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం మొదలైంది. నూతనంగా పియుసిలో చేరిన విద్యార్థులు క్యాంపస్ పద్ధతులను తెలుసుకొని, వాటికి అలవాటు పడి మసలుకోవాలని, బాధ్యతతో వ్యవహరిస్తూ మంచి భవిష్యత్తుకు దారులు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్, నూజివీడు డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్ మాట్లాడారు. ఈనెల 21వ తేదీ నుండి క్రమంగా అకడమిక్ షెడ్యూల్ ప్రకారం తరగతులు జరుగుతాయని, 28వ తేదీ నుండి ఫుల్ ఫ్లెడ్జ్ అవర్స్ ప్రారంభిస్తామని తెలిపారు.

'కత్తి పద్మారావు జన్మదిన వేడుకలు విజయవంతం చేయాలి'

ముదినేపల్లి : దళిత జాతి ముద్దుబిడ్డ కత్తి పద్మారావు పుట్టినరోజు వేడుకలు విజయవంతం చేయాలని మాల మహానాడు గ్రామ అధ్యక్షుడు డాక్టర్ సేవా నాగ జగన్ బాబురావు కోరారు. గుంటూరు జిల్లా పొన్నూరు లుంబిని వనం అనే గ్రామంలో కత్తి పద్మారావు దళిత నాయకులతో కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం ముదినేపల్లిలో విలేకరులతో బాబురావు మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ కత్తి పద్మారావు జన్మదిన వేడుకలు భారీగా చేయాలనే ఉద్దేశ్యంతో రాష్ట్రంలో ఉన్నటువంటి కొంతమంది నాయకులు ఒక కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మేమందరం 27వ తేదీన లుంబిని వనంలోని అంబేద్కర్ పార్కులో వేల మంది సమక్షంలో కత్తి పద్మారావు పుట్టినరోజు వేడుకలు నిర్వహించనునట్లు తెలిపారు. ఈ పుట్టినరోజు వేడుకలకు భారీగా క్రైస్తవ, దళిత, అంబేద్కర్ యువజన సంఘాలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బాబురావు కోరారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పక్కన సర్వీస్ రోడ్లు వేయాలి : రైతులు

టి.నరసాపురం: గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన సర్వీసు రోడ్లు వేసి రైతులకు పొలాల్లోకి వెళ్లటానికి గ్రావెల్ రోడ్లు వేయాలని కోరుతూ స్థానిక రైతులు మక్కినవారిగూడెం రోడ్డులోని గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన మంగళవారం సమావేశం నిర్వహించి ప్రభుత్వానికి పంపడానికి నివేదిక తయారుచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం ముందు రైతులకు పొలాల్లోకి వెళ్లటానికి గ్రావెల్ రోడ్లు వేస్తామని, హైవే పక్కన సర్వీసు రోడ్డు వేస్తామని చెప్పిన అధికారులు నేడు కనీసం రైతులు తమ పొలాల్లో పండించిన పంట తెచ్చుకోవడానికి వీలు లేకుండా పెద్ద పెద్ద గోతులు తవ్వి స్తంభాలు పాతి వలలు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వారు ఇచ్చిన మాట ప్రకారం రైతులకు పొలాల్లోకి వెళ్లడానికి రోడ్డు, పంట బయటికి తెచ్చుకోవడానికి సర్వీస్ రోడ్డు వెంటనే వేయించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జయ్యవరపు శ్రీరామమూర్తి, నల్లూరి వెంకట చలపతి రావు, అడపా నాగరాజు, లింగారెడ్డి శ్రీనివాసరావు, పిన్నమనేని మధు, పెద్దిన సత్యనారాయణ పాల్గొన్నారు.

నేరాలు – ఘోరాలు

రైలు ఢీకొని వృద్ధుడు మృతి

ఏలూరు స్పోర్ట్స్ : గుర్తుతెలియని వృద్ధుడు రైలు ఢీకొని మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటన ఏలూరు నగరంలోని వట్లూరు రైల్వే గేటు సమీపంలో చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్ తెలిపిన వివరాల ప్రకారం మృతిచెందిన వృద్ధుడు 50 నుంచి 55 ఏళ్ల వయసు కలిగి ఉంటాడని, నలుపు తెలుపు రంగు జుట్టు కలిగి ఉన్నాడని, సిమెంటు రంగు నిలువు చారలు కలిగిన పొడుగు చేతుల చొక్కా, గోధుమరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలు తెలిసినవారు రైల్వే ఎస్ఐ సైమన్ 9989219559 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా తయారీ స్థావరంపై దాడి

జీలుగుమిల్లి : మండలంలోని పి.అంకంపాలెం గ్రామ శివారులో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటుసారా తయారీ స్థావరంపై మంగళవారం జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ అధికారి కె.శ్రీనుబాబు ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడులలో 5 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని సారా తయారికి సిద్ధంగా ఉన్న 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఘటనలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి : 8 మంది అరెస్ట్

టి.నరసాపురం : మండలంలోని వల్లంపట్ల పంచాయతీ పరిధిలోని సింగరాయపాలెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించి 8 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.40,500 నగదు, 12 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు తావులేదని, పేకాట, గ్యాంబ్లింగ్ వంటి చట్టవ్యతిరేక చర్యలపై నిరంతరం దాడులు నిర్వహిస్తామని అన్నారు. యువత అసాంఘిక కార్యకలాపాల వైపు మళ్లకుండా జాగ్రత్తపడాలని, ఇటువంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పౌరులు తమ గ్రామాల్లో జరుగుతున్న అన్యాయమైన, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు, కానిస్టేబుల్ నాగబాబు పాల్గొన్నారు.

అమరావతిలో బిట్స్ ఫిలాని క్యాంపస్

గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



అమరావతిలో రూ.1000 కోట్లతో బిట్స్ ఫిలాని క్యాంపస్‌ను ఏర్పాటు చేయనున్నట్లు బిర్లా సంస్థ ఛైర్మన్ కుమార్ బిర్లా ప్రకటించడం ఎంతో శుభపరిణామమని, ఇది కూటమి ప్రభుత్వం సాధించిన విజయమని గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలపడం గొప్ప శుభపరిణామమన్నారు. ఈ బిట్స్ ఫిలాని క్యాంపు కార్యాలయం ద్వారా రాష్ట్రంలో విద్యాభివృద్ధికి అవకాశం పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో విద్యా శాతం పెరగడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విద్యకు వేల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత, మహిళలు ఈ సంస్థ ద్వారా విద్యను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ పథకం ఏడాది పొడిగింపు..

రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టులకు కల్పిస్తున్న ఉచిత హెల్త్ స్కీమ్ పథకం 2025 –26 ఏడాదికి పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు. వర్కింగ్ జర్నలిస్ట్స్ అందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు.

అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవిపై హర్షం..

అశోక్ గజపతి రాజుకు గవర్నర్ పదవి వరించడంపై మంత్రి కొలుసు పార్థసారధి హర్షం వ్యక్తం చేశారు. గోవా గవర్నర్‌గా నియమితులైన టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతి రాజుకు ప్రత్యేకంగా మంత్రి అభినందనలు తెలిపారు. టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలోనే కొనసాగుతూ, పార్టీ కష్ట సుఖాల్లో వెనువెంట ఉంటూ, పాలుపంచుకుంటూ, విలువలు, విశ్వసనీయతతో ముందుకు సాగిన గొప్ప రాజకీయవేత్త అశోక్ గజపతిరాజు అన్నారు. నీతి నిజాయితీకి నిలువుటద్దం అశోక్ గజపతిరాజు అని అభివర్ణించారు. అశోక్ గజపతిరాజుకు గవర్నర్ పదవి దక్కడం టిడిపి కుటుంబ సభ్యులుగా తమకు ఎంతో గర్వకారణమని తెలిపారు.

కోకో రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించాలి

రైతు సంఘం ఆధ్వర్యాన కోకో రైతుల సదస్సు

ద్వారకాతిరుమల(పంగిడిగూడెం) : కోకో రైతులకు అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర చెల్లించేలా ఫార్ములా రూపొందించాలని, రాష్ట్ర కోకో బోర్డును ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పంగిడిగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద కోకో రైతు సంఘం ఆధ్వర్యంలో కోకో రైతుల ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు రుద్రరాజు సుబ్బరాజు అధ్యక్షత వహించారు. సదస్సులో కోకో రైతుల సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కోకో పంటను మరింతగా ప్రోత్సహిస్తామని, ప్రస్తుతం ఉన్న 75 వేల ఎకరాలకు అదనంగా మరో లక్ష ఎకరాలలో కోకో పంట సాగుచేసేలా రైతులను ప్రోత్సహిస్తామని ప్రకటించిందన్నారు. ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న కోకో గింజలను మార్కెట్లో అమ్ముకోవడానికి రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, కోనేరు సతీష్ బాబు మాట్లాడుతూ కోకో రైతులంతా రైతు ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడి భవిష్యత్తులో తమ కోకో గింజలను మార్కెటింగ్ చేసుకునేలా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు మాట్లాడారు. సదస్సులో ఎస్.నాగబాబు, పి.ప్రసాద్, వి.వెంకటేశ్వరరావు, తూంపాటి అజయ్ కుమార్, ఎం.మురళీ, నల్లూరి బాపనయ్య పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు జిఒ ప్రకారం జీతాలివ్వాలి : సిఐటియు

చింతలపూడి : కార్మికులకు చెల్లించాల్సిన జీతాలు ప్రభుత్వ జిఒ ప్రకారం చింతలపూడి నగర పంచాయతీ చెల్లించడం లేదని, నగర పంచాయతీ అయిన దగ్గర నుంచి పారిశుధ్య కార్మికులకు ఇవ్వవలసిన జీతాలు అరకొర ఇస్తున్నారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌విఎస్.నారాయణ అన్నారు. చింతలపూడి నగర పంచాయతీ కార్మికుల సమావేశం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు జిఒ ప్రకారం వేతనాలు పెంచాలని, పని భారం తగ్గించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు ఇవ్వవలసిన ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా చింతలపూడి నగర పంచాయతీ కార్మికులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరవుతారన్నారు. ఈనెల 19వ తేదీన మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి నగర పంచాయతీ కమిషనర్‌కు, లేబర్ డిపార్ట్‌మెంట్‌కు నోటీస్ అందజేస్తామని, సమస్యను పరిష్కరించకుంటే సమ్మె చేయటానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు.

కెడిసిసిలో తక్కువ వడ్డీతో అధిక రుణాలు

బ్యాంక్ చీఫ్ మేనేజర్ తలారి వెంకట రంగా ప్రసాద్



ముసునూరు : వ్యవసాయ భూమి పరిమితిని బట్టి తక్కువ వడ్డీతో ఎంతోమంది రైతు సోదరులకు కెడిసిసి బ్యాంక్ రుణ సౌకర్యం కల్పిస్తుందని ఆ బ్యాంక్ చీఫ్ మేనేజర్ తలారి వెంకట రంగాప్రసాద్ తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ కెడిసిసి బ్యాంక్ పరిధిలో మండలంలోని 16 గ్రామాల వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ పరిధిలోని వాటి శివారు గ్రామాలతో కలుపుకొని అన్ని గ్రామాల్లోని రైతులందరికి వ్యవసాయ భూమిపై స్వల్ప కాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. రుణాలు పొందిన రైతులు నెలనెలా, ఆరునెలలకోసారి లేదా సంవత్సరానికి ఒకసారి వడ్డీతో సహా అసలు కలిపి నగదు జమచేసే విధంగా వెసులుబాటు కల్పిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. అదేవిధంగా బ్యాంక్ సూచనలు మేరకు గోల్డ్ లోను కూడా బంగారాన్ని బట్టి అధిక మొత్తంలో తక్కువ వడ్డీకి ఎక్కువ నగదు ఇచ్చే విధంగా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ తెలియజేశారు.

పునరుత్పాదక ఇంధన వనరులపై అవగాహన



మాట్లాడుతున్న రామ్ కుమార్

ఆగిరిపల్లి : పునరుత్పాదక ఇంధన వనరులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సాంప్రదాయేతర ఇంధన నిర్వహణ, సామర్థ్యం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని గ్రిడ్ ఇండియా చీఫ్ ఇంజనీర్ కెబివి.రామ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని పోతవరప్పాడు ఎన్నారై కళాశాలలో మంగళవారం పవర్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ చీఫ్ ఇంజనీర్ టి.శైలజ ఆధ్వర్యాన పునరుత్పాదక ఇంధన వనరులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ ఆర్.వెంకట్రావు పునరుత్పాదక ఇంధన ప్రాముఖ్యత గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, ఇఇఇ.విభాగాధిపతి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్.సాంబశివరావు, ఎపి ట్రాన్స్‌కో ఇంజనీర్లు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా ప్రశాంతి బాధ్యతలు



ముసునూరు: మండల నూతన తహశీల్దార్‌గా డి.ప్రశాంతి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. చాట్రాయి మండల తహశీల్దార్‌గా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా ముసునూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులకు, విద్యార్థులకు, సామాన్య ప్రజానీకానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేస్తానని తెలియజేశారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన

చింతలపూడి : మధ్యవర్తిత్వం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ చేసుకోవచ్చునని చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధు బాబు అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 10 నుంచి 16 వరకు మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమాలలో మంగళవారం మండలంలో జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు అధ్యక్షతన మధ్యవర్తి న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధ్యవర్తిత్వ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మాణిక్యాలరావు, న్యాయవాదులు, కోర్టు సూపర్నెంట్ పి.గురువీనాయుడు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం-మన దేశం అనే అంశంపై న్యాయమూర్తులు, న్యాయవాదులు మంగళవారం న్యాయస్థానాల ప్రాంగణం నుంచి పట్టణంలోని ప్రధాన రహదారులలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ మాట్లాడుతూ మధ్యవర్తిత్వం మన దేశం అనే కార్యక్రమం సుప్రీంకోర్టు ఆదేశంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏళ్ల తరబడి కేసులు పెండింగులో ఉండకుండా మధ్యవర్తిత్వమే మంచి మార్గం అన్నారు. న్యాయమూర్తి పెద్ద కాసిం, న్యాయవాదులు, న్యాయస్థానాల సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నివారించాలి

హెచ్‌ఎం విజయకుమారి

నూజివీడు టౌన్ : బాల్యవివాహాలు నివారించాలని కథ రూపంలోను, నృత్య రూపంలో కళాకారులు ఎంతో అభినయం చేశారని హెచ్‌ఎం విజయకుమారి తెలిపారు. మండల పరిధిలోని అన్నవరం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బాల్యవివాహ వ్యతిరేక ప్రచారోద్యమంలో భాగంగా వీధి నాటక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బాల్య వివాహరహిత సమాజం నిర్మూలిద్దామని కథ రూపంలో, పాటల రూపంలో, నాటక రూపంలో ప్రదర్శించారు. బాల్య వివాహ రహిత భారత్‌ను నిర్మూలిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుని విజయకుమారి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం వివాహ వయస్సు బాలికలకు 18 సంవత్సరాలు, బాలురకు 21 సంవత్సరాలు ఉండాలని తెలియజేశారు. చదువుకొనే వయస్సులో అందరూ కష్టపడి చదువుకోవాలని, విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. బాల్య వివాహాలు చేస్తే విధించే శిక్షలు గురించి వివరించారు. గ్రామంలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే 1098కి ఫోన్ చేయాలని తెలిపారు. అనంతరం సిడిపిఒ విజయకుమారి మట్లాడారు. ఈ కార్యక్రమంలో శాంతి కల్చరల్ సొసైటీ కళాకారులు రవికుమార్, రాము, మహేష్, చిన్ని, శ్రావణి, రంగనాయకి, ఉపాధ్యాయులు రవీంద్ర, నాగేంద్రరావు, నాగరాజు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి : ఎస్ఐ

మండవల్లి: వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, లేకుంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లేనని ఎస్ఐ రామచంద్ర రావు స్పష్టం చేశారు. మండలంలోని ఏలూరు రోడ్‌లోని కరెంట్ ఆఫీస్ వద్ద మంగళవారం సాయంత్రం వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రమాదాలు సంభవించి ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. అనంతరం హెల్మెట్లు, వాహన పత్రాలు లేని 16 మంది వ్యక్తులపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.4,180 చలానా విధించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

హోంగార్డుకు ఆర్థిక సాయం

ఉంగుటూరు : నిడమర్రు సర్కిల్ పరిధి చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న శానం శివాజీ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. గుంటూరు హాస్పిటల్‌లో వెన్నుపూస ఆపరేషన్ చేయించుకుని సుమారు రెండు నెలల నుంచి మంచంపై ఉంటూ ఎటూ కదలని స్థితిలో ఉన్నాడు. దీంతో సర్కిల్స్ పరిధిలో ఉన్న ఆఫీసర్లు, సిబ్బంది అందరూ కలిసి రూ.లక్ష మంగళవారం నిడమర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రజిని కుమార్, చేబ్రోలు ఎస్ఐ ఎం.సూర్య భగవాన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందించారు.

నైట్ వాచ్‌మెన్ల జీతాలు చెల్లించాలి : ఎఐటియుసి

ఏలూరు అర్బన్ : ప్రభుత్వ పాఠశాలలలో రాత్రిపూట కాపలాదారుగా పనిచేస్తున్న నైట్ వాచ్ మెన్ల జీతాలు చెల్లించాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద నైట్ వాచ్ మెన్ల జీతాలు చెల్లించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిని అదనపు సంచాలకులు అవధానికి అందజేశారు. ఈ ధర్నాలో కోండ్రు వెంకటేష్, బోయిన జాన్, చవటపల్లి రత్నరాజు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **PERURI LAKSHMI** (New Name), W/O Ramachandrarao, Previously Called PEROORI LAKSHMI (Old Name), Resident of D.No.3-152/2, Kamma Vari Street, SIDHANTHAM Village, Penugonda Mandal, W.G.Dt., Pin-534326, Andhrapradesh. I have changed my name from PEROORI LAKSHMI (Old Name) To **PERURI LAKSHMI** (New Name) for all practical purposes.

CHANGE OF NAME

I, **PERURI NAGESWARARAO** (New Name), S/O Ramachandra rao , Previously Called PEROORI NAGESWARARAO (Old Name), Resident of D.No.3-151, Rice Mill Beside, SIDHANTHAM Village, Penugonda Mandal, W.G.Dt., Pin-534326, Andhra pradesh. I have changed my name from PEROORI NAGESWARARO (Old Name) To **PERURI NAGESWARA RAO** (New Name) for all practical purposes.

సర్టిఫికేట్ పోయినది

ఏలూరు జిల్లా, టి.నరసాపురం మండలం, మరియాపురం గ్రామ కాపురస్తులు యలమర్తి రీను, D/o.చిన్న ఏసుపాదం అను నా యొక్క ఓరిజినల్ SSC సర్టిఫికేట్ పోయినది. ది.5-7-2025 తేదీన నా స్వగ్రామం అయిన మరియాపురం నుండి టి.నరసాపురం జిరాక్స్ తీయించుకొనుటకు జిరాక్స్ సెంటర్‌కు మోటారు సైకిల్ పై వెళ్లుచుండగా మే నెల 2017 రోల్ నెం.1711129695 APSWR SCHOOL FOR GIRLS జంగారెడ్డిగూడెం, నెం. గల ఓరిజినల్ SSC సర్టిఫికేట్ పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

యలమర్తి రీను, D/o.చిన్న ఏసుపాదం, మరియాపురం, టి.నరసాపురం మండలం, ఏలూరు జిల్లా. సెల్: 82470 53634

డాక్యుమెంట్ పోయినది

ఏలూరు జిల్లా, సత్రంపాడు, డోర్‌నెం.4-23రు కాపురస్తులు **ముప్పిన శ్రీనివాసరావు** కుమార్తె మున్నా బండి లక్ష్మిసాయి గారి భార్య అయిన ముప్పిన భాగ్యశ్రీ అను నేను ది.2-4-2025వ తేదీన సత్రంపాడు ఇంటి నుండి బయలుదేరి రిజిష్టరు వారి కార్యాలయము వద్ద ఫోటోస్టాట్ నిమిత్తం నాస్కూటర్‌పై వెళ్లు సమయంలో ది.25-8-2021వ తేదీన ముప్పిన కోటేశ్వరరావు గారు వ్రాసిన వీలునామా ఓరిజినల్ డాక్యుమెంట్ పోయినది. సదరు వీలు నామాలో వారు రేపూడి గ్రామ ఆస్తి గురించి అప్పనవీడు గ్రామ ఆస్తులు వగైరాలు గురించి వారి అనంతరం చెందు ఏర్పాటుతో వీలునామా వ్రాసినారు. ఎంత వెతికనను దొరకలేదు. ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కె.కృష్ణమాచార్యులు, అడ్వకేట్, ఏలూరు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, ELURU

E.P.No.40/2023, O.S.414/2018

Between :
Bathula Reddappa, S/o.Perayya, Eluru. ...DHR
And
Palagani Bhima lingeswara Rao, S/o.Satyanarayana, D.No. 28-1-29, SBH, Santhi Nagar, Eluru.

పై నెంబరు EP లో శ్రీకోర్టు వారు పంపిన నోటీసులు మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకోని కారణంగా ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు అమలుకు ఉత్తర్వులు ఇచ్చినారు. సదరు EP వాయిదా ది.01-08-2025న ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి వద్ద మీరు గాని మీ ప్లీడరు గారు ద్వారా గాని హాజరు కాగలరు లేనియెడల మీ పరోక్షంగా విచారించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

ది.10-7-2025 **కె.రాధాకృష్ణ**
ఏలూరు. అడ్వకేటు, ఏలూరు.

మహారాజశ్రీ Vవ అడిషనల్ జిల్లా జడ్జి వారి కోర్టులో, ఏలూరు

ఎం.వి.ఓ.పి.నెం.105/2025

బిట్వీన్ :
జొన్నాదుల లక్ష్మి ...పిటిషనర్
&
కదుర్ల ప్రసాదు & అదర్స్ ...రెస్పాండెంట్స్

STEPS PETITIONS FILED BEHALF OF THE PETITIONER UNDER ORDER -5 RULE 20 OF CPC

పై నంబరు గ్రంథంలో R1 శ్రీ కదుర్ల ప్రసాదు, S/o.సత్యం, డ్రైవర్ & ఓనర్, మోటార్ సైకిల్ నెం.AP39 QH 4087, R/o.H.No.20a-11-42, 46th డివిజన్, కొత్తపేట, చోదిమెళ్ళ, ఏలూరు, ఎపి. అనువారికి నోటీసులు అమలు కొరకు పైకోర్టు వారి ఎదుట ది.22-7-25 తేది ఉదయం 10.30 ని॥లకు స్వయంగా గాని వకీలు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.
(శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

బద్ది వరహాలరావు
బద్ది శిరీష, బద్ది అవినాష్
అడ్వకేట్స్, ఏలూరు.
సెల్: 9440653935

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కోర్టులో

O.S.No.212/2016

బిట్వీన్ :
వాదులు : చెల్లబోయిన మాధవరావు వగైరాలు
And
ప్రతివాదులు : చెల్లబోయిన సహ దేవుడు వగైరాలు
5వ ప్రతివాది : గుత్తుల జోగారావు, S/o.(లేటు) సత్యనారాయణ, సగంచెరువు, చిట్టవరం పోస్టు, నరసింహరావుపేట, పాలకొల్లు మండలం.

యీ నెంబరు దావాలోను 5వ ప్రతివాది IA.No.1072/2023 రు Order 1 Rule 10 పిటిషనులోను 5వ రెస్పాండెంటుకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపించినను అతను తీసుకొనక పిటిషనరును చిక్కులు పెట్టవలెననే దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నందున అతనికి నోటీసులు అమలు జరగనందున శ్రీకోర్టు వారు Substituted Service ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరు వేసిపై 5వ ప్రతివాది /5వ రెస్పాండెంటు హాజరు నిమిత్తము **ది.1-8-2025** సం॥ము తేదీకి వాయిదా వేసినారు. కావున సదరు వాయిదాకు సదరు 5వ ప్రతివాది స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం 10 గంటలకు శ్రీ పైకోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

నరసాపురం **ఎన్.ఆనందచక్రవర్తి**
ది.15-7-2025 అడ్వకేట్, నరసాపురం.
సెల్: 98491 45267

CHANGE OF NAME

I, **PERURI RAMACHANDRARAO** (New Name), S/o.Manikyam, Previously Called PEROORI RAMA CHANDRA RAO(Old Name), Resident of D.No.3-152/2, Kamma Vari Street, SIDHANTHAM Village, Penugonda Mandal, W.G.Dt., Pin-534326, Andhra pradesh. I have changed my name from PEROORI RAMA CHANDRA RAO (Old Name) To **PERURI RAMA CHANDRARAO** (New Name) for all practical purposes.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

S.O.P.No. 6/2025

మధ్యన:
1. పెన్నాడ నాగేశ్వరరావు
2. పెన్నాడ వరలక్ష్మి ...పిటిషనర్లు

మరియు

నిల్ ...రెస్పాండెంట్

పైన ఉదహరించిన గ్రంథములోని పిటిషనర్లు వారి కుమార్తె అయిన పెన్నాడ బేబీ రాజేశ్వరి V.R.O గా పని చేయుచు ఏవిధమైన లికితము రాయకుండా మరణించినందున ఆమెకు వారసులుగా ఆమె తల్లిదండ్రులు అయిన పిటీషనర్లు ఇరువురు ఆమె తాలూకు 1. **దివి. 28-10-2013** గా గల L.I.C పాలసి నంబరు: **805756957** తాలూకు సొమ్ము **Rs. 2,00,000/-** మరియు **దివి. 25-03-2017** గా గల పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (PLI) నంబరు: **0000001026236** తాలూకు సొమ్ము **Rs. 5,00,000/-** ఆయా సంస్థల నుండి పొందుటకు వారసత్వ సర్టిఫికేట్‌ను ఇప్పించుమని కోరుతూ ఈ పిటిషన్‌ను శ్రీ కోర్టు వారి ముందు దాఖలు చేసినారు. సదరు SOP 06/2025 విచారణ నిమిత్తము **దివి. 22-07-2025** న వ వాయిదా అయి వున్నది. అందులకు ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరములు వున్నచో **దివి. 22-07-2025 వ తారీకున** పైన ఉదహరించిన శ్రీ కోర్టు వారి ముందు స్వయముగా కానీ, న్యాయవాది ద్వారా కానీ **ఉదయం గం. 10-30 ని॥లకు** హాజరు అయి తమ అభ్యంతరములను శ్రీ కోర్టు వారికి తెలియపర్చవచ్చును.

కొల్లి సుబ్రమణ్య శర్మ
తాడేపల్లిగూడెం పిటిషన్ వార్ల తరపు న్యాయవాది
ది.12-07-2025 తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా
సెల్: 93469 21892
సెల్: 63017 05942

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.22/2024 in O.S.188/2015

బిట్వీన్:
మద్దాల సత్యనారాయణ ...పిటీషనర్/వాది/DHr
మరియు
1.కవల భీష్ముడు
2.కవల లక్ష్మి అలియాస్ సీతామహాలక్ష్మి
...రెస్పాండెంట్లు / ప్రతివాదులు/Jdrs

2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది /2వ Jdr :
కవల లక్ష్మి అలియాస్ సీతామహాలక్ష్మి,
భర్త : కవల భీష్ముడు, మహిళ, వయస్సు 42,
డోర్‌నెం.4-37, కొమ్మర గ్రామము,
గణపవరం మండలం, ప.గో.జిల్లా, ఎ.పి.

పై నంబరు గ్రంథములో శ్రీకోర్టు ద్వారా 2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది / 2వ Jdr కి పలుమార్లు నోటీసులు పంపించినప్పటికిని 2వ రెస్పాండెంట్/2వ ప్రతివాది /2వ Jdr తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీకోర్టు వారు Substitute ఉత్తర్వులు ప్రకారం ది.21-07-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు పైకోర్టు వారి యెదుట 2వ రెస్పాండెంట్ /2వ ప్రతివాది/2వ Jdr స్వయంగా గాని, లాయరు గారు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు ఏమైన ఉన్నచో తెలుపవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును అని ఇందుమూలముగా తెలియచేయడమైనది.
(కోర్టు వారి అనుమతితో)

కొప్పర్తి శ్రీనివాసరావు, కాళ్ళ లక్ష్మి
పిటీషనర్ /వాది/Dhr అడ్వకేట్స్
తాడేపల్లిగూడెం తాడేపల్లిగూడెం.
ది.14-07-2025 సెల్: 9381041404

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా నేను అనగా ఏలూరు జిల్లా భీమడోలు మండలం, భీమడోలు గ్రామ కాపురస్తుడను అయిన **చోడిశెట్టి సుబ్రహ్మణ్యం తండ్రి చోడిశెట్టి శ్రీరామమూర్తి** అను నాకు డిటో జిల్లా, డిటో గ్రామంలో మా తండ్రి చోడిశెట్టి శ్రీరామమూర్తి గారి స్వార్జితం అయిన స్థిరాస్థిని నా వాణిజ్యపరమైన అవసరాల నిమిత్తము గాను నాకు గిఫ్ట్‌డీడ్ రూపంలో సంక్రమించిన ఆస్థి అయ్యివున్నది. సదరాస్థి తాలూకా దస్తావేజు నెంబరు **607 / 2003**, రిజిస్ట్రేషన్ **తేదీ 5-3-2003** గల సదరు ఆస్థి ప్రస్తుతం నా పేరిట కలదు. సదరాస్థిని నేను నా వాణిజ్య పరమైన అవసరాల నిమిత్తం హైదరాబాద్‌కు చెందిన హిందూజ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, రాణీగంజ్ బ్రాంచి వారికి తాకట్టు పెట్టి వారి నుండి **23,90,000/- (అక్షరాలా ఇరవై మూడు లక్షల తొంబైవేల రూపాయలు)** రుణం తీసుకోవడం జరిగింది. ఈ లోను పూర్తి రుణాన్ని తీర్చడానికి నేను నా పేరిట వున్న ఆస్థిని అమ్మడానికి ప్రయత్నిస్తుండగా సదరాస్థి కొనుగోలుకు వచ్చే వ్యక్తులను డిటో జిల్లా, డిటో గ్రామం కాపురస్తులు అయిన కేసిరెడ్డి లక్ష్మణరావు (లక్ష్మణ్), వర్దినీడి సత్య సాయి వెంకటేశ్వరరావు అను ఇరువురు వ్యక్తులు గత కొంత కాలంగా అడ్డుపడుతూ వారికి మా ఆస్థిలో హక్కులు వున్నట్లు కొనుగోలుదారులకు లేనిపోని మాటలు చెబుతూ సదరాస్థి అమ్మకం కాకుండా అడ్డుపడుతున్నారు. వాస్తవంగా ఇప్పటివరకు ఈ స్థిరాస్థిని నేను గానీ, నా తండ్రిగానీ, నా పిల్లలు గానీ ఇంకనూ మిగిలిన నా కుటుంబ సభ్యులు ఎవరమూ కూడా ఎవరితోనూ ఎటువంటి క్రయ, విక్రయాల గానీ ఎటువంటి ఒప్పందాలు గానీ ఏమీ చేసుకోలేదు. ఎవరికీ కూడా ఏ విదమైన అగ్రిమెంట్లు గానీ తాకట్టులు గానీ తనఖాలు గానీ కూడా చేయలేదు. అదేవిదంగా ఎవరికీ ఏ రూపంలోనూ ఎటువంటి దస్తావేజులు కూడా రాయలేదు. ఎవరైనా దీనికి వ్యతిరేకంగా వారి దగ్గర మేము రాసినట్లుగా ఏమైనా దస్తావేజులు గానీ, అగ్రిమెంట్లు గానీ ఇతరత్రా రాతపూర్వకమైన ప్రతులు ఎవరైనా ఏమైనా వారిస్తాను సారంగా సృష్టించినట్లు అయితే అటువంటి వారిపై చట్టపరంగా తగు సివిల్ క్రిమినల్ చర్యలు తీసుకోవడం జరుగుతుంది. షెడ్యూల్ ఆస్థికి హద్దులు **తూర్పు** : పంచాయితీ రోడ్డు, **దక్షిణం** : వర్దినీడి సత్య సాయి వెంకటేశ్వరరావుగారి స్థలం **పడమర** : ఆరు గజాల వెడల్పుగల రోడ్డు **ఉత్తరం** : వర్దినీడి సత్య సాయి వెంకటేశ్వరరావు గారి ప్లాట్ 39 స్థలం

చోడిశెట్టి సుబ్రహ్మణ్యం
శిల్పానగర్, నాగారం,
మేడ్చల్ మల్కాజ్‌గిరి
స్థలం : భీమడోలు తెలంగాణా రాష్ట్రం
తేది :15-07-2025 సెల్ : 9346209189